క్లుప్తంగా

డంపింగ్ యార్డ్‌లో మూడు కొత్త వాహనాలు ప్రారంభం



వాహనాలు ప్రారంభిస్తున్న చీఫ్ మెడికల్ అధికారి నరేష్‌కుమార్

పెదగంట్యాడ: డంపింగ్ యార్డ్‌లో ఎప్పటికప్పుడు చెత్తను తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జీవీఎంసీ చీఫ్ మెడికల్ అధికారి నరేష్‌కుమార్ అన్నారు. స్థానిక డంపింగ్ యార్డ్‌కు కొత్తగా వచ్చిన మూడు వాహనాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక టారస్, ఒక జేసీబీ, ఒక సెప్టిక్ ట్యాంక్ వాహనాలు కొత్తగా వచ్చాయన్నారు. అందులో రెండు వాహనాలు 15వ ఆర్థిక సంఘం నిధులతో ఒకటి నేషనల్ సఫాయి కర్మ వారి నిధులతో కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-6 జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు, ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సౌత్ ఏషియా ఎల్‌పీజీ అధికారులు

అక్కిరెడ్డిపాలెం: రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన ఉండాలని సౌత్ ఏషియా ఎల్‌పీజీ అసిస్టెంట్ మేనేజర్ రామ్‌నాథ్ అన్నారు. మంగళవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యునైటెడ్ వేస్ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా రోడ్డు ప్రమాదాల్లో నిర్లక్ష్యం కారణంగా మృతి చెందుతున్న వైనాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు దేముళ్లు, పీడీ ఇస్మాయిల్, యునైటెడ్ వేస్ ప్రతినిధి సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

గాజువాక: జీవీఎంసీ 66వ వార్డు సీతారామ్‌నగర్‌లోని సాయి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ఫేర్వెల్, గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులను పై తరగతులకు ప్రమోట్ చేస్తూ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మహేశ్వరరావు, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, సీతంనాయుడు, సింహాచలం, పర్వీన్ రుఖియా, శైనాజ్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పోలీసుల తనిఖీలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వసతి గృహాల్లో సోమవారం అర్ధరాత్రి పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఏయూ హాస్టళ్లలోకి అనధికార వ్యక్తులు ప్రవేశించడం, వారి వద్ద అనుమానిత ప్యాకెట్ లభించిన నేపథ్యంలో పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి 12 గంటల నుంచి వర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఇంజినీరింగ్ కళాశాలల్లో హాస్టల్ గదులను తనిఖీలు చేశారు. దాదాపు 30 మందికి పైగా పోలీసులు ఈ సోదాల్లో పాల్గొన్నట్లు తెలిసింది. అయితే వారి తనిఖీల్లో ఎటువంటి అనుమానిత వస్తువులు లభించలేదు. బయటి వ్యక్తులు కూడా లేరని పోలీసులు నిర్ధారించారు.

రజకుల జీవితాల్లో వెలుగులు

- అందుబాటులో దోబీఖానాలు
- చేదోడు పథకంతో ఆర్థిక ఆసరా



68వ వార్డు రాంనగర్‌లోని అన్ని సదుపాయాలతో దోబీఖానా



అన్ని సౌకర్యాలతో ప్రారంభమైన అక్కిరెడ్డిపాలెం దోబీఖానా

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో కులవృత్తులు చేసుకునే వారి జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయి. చేదోడు పథకం ద్వారా నాయిబ్రాహ్మణులకు, రజకులకు, దర్జీలకు ఏటా రూ.10 వేలు అందజేస్తూ వారి కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఇక రజకులకు వెన్నుదన్నుగా నిలిచేలా స్వయం ఉపాధి కింద దోబీఖానాల ఏర్పాటుతో ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, రాంనగర్, గుడివాడ అప్పన్నకాలనీలలో దోబీఖానాల నిర్మాణాలకు జీవీఎంసీ నిధుల కింద రూ.39 లక్షలు వెచ్చించింది. దీనిలో భాగంగా రాంనగర్ దోబీఖానా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు. వీరికి మోటార్లు, నీళ్ల కుండీలు, బల్లలు, దుస్తులు ఆరవేసేందుకు విశాలమైన స్థలం ఏర్పాటు చేశారు. అక్కిరెడ్డిపాలెంలో దోబీఖానాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. గుడివాడ అప్పన్న కాలనీలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో సుమారు 110 రజకుల కుటుంబాలు దోబీఖానాలపైనే ఆధారపడ్డారు. గత ప్రభుత్వంలో రజకులకు కనీసం దోబీఖానాల ఏర్పాటు అంతంత మాత్రం ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది.

దోబీఖానాలు అభివృద్ధి



గత ప్రభుత్వ హయాంలో రజకుల జీవితాలు అస్తవ్యస్తంగా మారాయి. నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దోబీఖానాల ఏర్పాటు చేయమని వార్డు ఇన్‌చార్జ్ గుడివాడ లతీష్‌ను కోరడంతో ఆయన ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో వెంటనే దోబీఖానాను అభివృద్ధి చేసి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు తొలగాయి.

–ఉసలపూడి కొండమ్మ, రాంనగర్

గత ప్రభుత్వం నిర్లక్ష్యం



అక్కిరెడ్డిపాలెంలో దోబీఖానా త్వరలో అందుబాటులోకి రానుంది. ఇవి అంటుబాటులోకి వస్తే ఆర్థికంగా వెసులుబాటు ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో దోబీఖానాల ఏర్పాటు ఊసే ఎత్తలేదు. హామీలే తప్పా కార్యాచరణ జరగలేదు. కానీ జగన్ ప్రభుత్వంలో రజకులపై ప్రత్యేక దృష్టి సారించారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి దోబీఖానా నిర్మాణం చేపట్టారు.

–మడిక కనకారావు, అక్కిరెడ్డిపాలెం

రజకులకు బాసట



గత ప్రభుత్వ హయాంలో అక్కిరెడ్డిపాలెంలో దోబీఖానా లేక రజకులకు వృత్తి పనులు చేసుకోవడానికి అవకాశం లేని పరిస్థితి. రజకులకు కేటాయించిన స్థలంలో దూరంగా నీరు తెచ్చుకొని దుస్తులు ఉతుక్కునేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. కానీ ఇప్పుడు అన్ని సౌకర్యాలతో దోబీఖానాల ఏర్పాటు చేశారు. జగన్ ప్రభుత్వం రజకులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యున్నతికి కృషి చేస్తోంది.

–జి.బాబూజీ, అక్కిరెడ్డిపాలెం

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు, రేషన్ సరుకులు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

అగనంపూడి: ఉక్కులో విధి నిర్వాహణలో ప్రమాదవశాత్తు వెన్నెముక, కాలు విరిగి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అగనంపూడి నిర్వాసిత కాలనీకి చెందిన గుదే అప్పలరాజు కుటుంబానికి శ్రీపద్మ మార్కండేయ సేవా సంఘం చేయూతనందించింది. అగనంపూడి పెదమడకలో నిర్వహించిన కార్యక్రమంలో అప్పలరాజు కుటుంబానికి రూ.20వేలు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు మాట్లాడుతూ సంఘంలో కీలకంగా వ్యవహరిస్తూ ప్రమాదానికి గురై ఇబ్బందులు పడుతున్న అప్పలరాజును ఆదుకోవడం కనీస బాధ్యతగా భావించామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గంధోళి నరసింగరావు, వరలక్ష్మి, బేతా హనుమంతురావు, దొడ్డి దేముడు, గంధోళి వెంకటరమణ, గుదే సుశీలా గజేంద్రరావు, గంధోళి పైడికొండ, పచ్చారి రామలక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి



తయారు చేసిన ఉపగ్రహాల నమూనాలతో విద్యార్థులు, అతిథులు

అగనంపూడి: పోటీ ప్రపంచంలో విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని పారిశ్రామిక ప్రాంత ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు అన్నారు. అగనంపూడిలోని విజ్ఞాన్ బ్రిలియంట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ విజ్ఞాన్ శాస్త్ర, సాంకేతిక రంగాల నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, విందుల వరహాలు, సాయిన సన్యాసిరావు, పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో



పల్స్ పోలియో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదు సంవత్సరాలలోపు పిల్లల కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలో 2,08,163 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. 1002 పోలియో కేంద్రాలు, 74 మొబైల్ బృందాలు, 32 ట్రాన్సిట్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లాలో 6,51,702 ఇళ్లను మార్చి 4,5 తేదీల్లో పరిశీలించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులుంటే అటువంటి వారికి ఇంటి వద్దే పోలియో చుక్కలు వేస్తామన్నారు. జిల్లాలో 2,65,820 డోసుల వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రశాంతి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ, వైద్యులు జగదీష్ ప్రసాద్, మురళీకృష్ణ, రవిశంకర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో రజకులకు ప్రాధాన్యత ఉండేలా చొరవ తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి శ్రీనివాస గోపాలకృష్ణను విశాఖ ఉమ్మడి జిల్లా రజక సంఘం వినతిపత్రంలో కోరింది. రాజమహేంద్రవరంలో మంత్రిని కలిసిన సంఘ నాయకులు కులవృత్తులు సాగించే రజకులకు పథకాలు అమలు చేయాలని, ఎస్సీల జాబితాలో చేర్చాలని, 50 ఏళ్లు దాటిన రజకులకు పింఛన్ అందివ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డ్రై క్లీనింగ్ పనులు రజకులకే వర్తించేలాచొరవ తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర చైర్మన్ పొన్నాడ మోహనరావు, ఉమ్మడి విశాఖజిల్లా అధ్యక్షుడు తోకాడ రాము, ప్రతినిధులు అడ్డూరి శ్రీనివాసరావు, రాము, పట్నాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధికి సైన్సే సోపానం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: సుస్థిరమైన భవిష్యత్‌కు శాస్త్రవిజ్ఞానం దోహదపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం ఏయూలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా జియోఫిజిక్స్ విభాగంలోని సి.వి.రామన్ విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పరిపాలన భవనం వద్ద విద్యార్థుల ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సైన్స్ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ.. బీచ్‌రోడ్డులోని కన్వెన్షన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడారు. యువత నిరంతర అభ్యాసకులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. యంత్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థగా నేడు ప్రపంచం మార్పు చెందుతోందని, దీనికి అనుగుణంగా యువత సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. సునిశిత పరిశీలన, అవగాహన, ఆచరణ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యా రంగానికి అపారమైన నిధులు, ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని వెల్లడించారు. కోర్సుల రూపకల్పన, ప్రయోగశాలల ఆధునికీకరణ, ఇంటర్న్‌షిప్‌లు కల్పన, స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలకు చేపడుతున్నట్లు తెలిపారు. ఎడ్ఎక్స్ కోర్సులను రాష్ట్ర యువతకు ఉపయుక్తంగా ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ మీ వైఖరులే మీ భవిష్యత్ ప్రగతిని నిర్దేశిస్తాయన్నారు. వర్సిటీ వసతులను సద్వినియోగం చేసుకుంటూ.. ఆలోచనలకు కార్యరూపం ఇవ్వాలన్నారు. మీలోని సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వెలికితీయాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ 25కి పైగా పేటెంట్‌లు దాఖలు చేశామని, 82 శాతం విద్యార్థులకు గతేడాది ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. ఏయూలో 9 ఏళ్లకు పైగా సి.వి రామన్ విధులు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు అనురాధ కామేశ్వరి, సంధ్య దీపిక, పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న విద్యార్థిని



ర్యాలీగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తున్న ఏయూ విద్యార్థులు

పేదలపాలిట వరం వికసిత భారత్

కూర్మన్నపాలెం: పేదలు, రైతులు, మహిళలు, యువజనుల సాధికారత సాధించిన నాడే భారతదేశం పూర్తి సాధికారతను సాధించినట్లవుతుందని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి ఆరోగ్య కేంద్రం ఆవరణలో వికసిత భారత్ సంకల్పయాత్రను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చూడడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ సోంబాబు, గూటూరు శంకరరావు, బొండా యల్లాజీ, కట్టా పద్మ, నాగేశ్వరరావు, భువనేశ్వరి, సీడీసీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీ కొని వ్యక్తి దుర్మరణం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పీఎం పాలెం టాఫిక్ పోలీసులు

పీఎంపాలెం: పరదేశిపాలెం కూడలికి సమీపంలో జాతీయ రహదారిపై టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో బైకిస్ట్ మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరావు తెలిపిన వివరాలివీ.. పరదేశిపాలెంలో కుటుంబంతో సుంకరి నాగరాజు (38) నివసిస్తున్నాడు. అతను కూలి పనులు చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పరదేశిపాలెం నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కుతుండగా నగరం వైపు నుంచి ఆనందపురం వైపునకు వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే క్రమంలో టిప్పర్ లారీ ముందు వెళుతున్న కంటైనర్ వాహనాన్ని కూడా ఢీకొట్టడంతో అదుపు తప్పి తుప్పల్లోకి దూసుకు పోయింది. విద్యుత్ స్తంభంను ఢీకొట్టి ఆగింది. అపస్మారకస్థితిలో ఉన్న క్షతగాత్రుడిని కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. నాగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని బంధువు పి.సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం



ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రపంచంలోనే మహోన్నతమైన భారత రాజ్యాంగాన్ని కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తూ అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు దీక్షలు మంగళవారం నాటికి 1,111వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పలు విభాగాల కార్మికులు పాల్గొని విశాఖ ఉక్కు –ఆంధ్రుల హక్కు అంటూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం



బ్యాగులను అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: నన్హి కలీ శిక్షణ సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ పొందిన విద్యార్థులకు కిట్లను అందజేశారు. మంగళవారం 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో 176 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. నన్హి కలీ శిక్షణ హెడ్ వై.సంధ్య మాట్లాడుతూ నాందీ ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పలు అంశాల్లో వెనుక బడిన విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా కిట్లలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కలర్ పెన్నులు, రెయిన్ కోటు, బ్యాగ్ అందజేశామన్నారు. మహేంద్ర రైస్ సంస్థ బ్యాగులను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, దేముళ్లు, నాగేశ్వరరావు, పీడీ ఇస్మాయిల్ పలువురు పాధ్యాయినులు, నన్హి కలీ బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తమాంబ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ గ్రామ దేవత కొత్తమాంబ అమ్మవారి ఉత్సవాలు మేళతాళాలు, డప్పు వాద్యాలతో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు వెంపాడ నాయుడు, వెంపాడ అప్పారావు, వెంపాడ అప్పలరెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేమువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారి ఘటాలను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక మహిళలు పూర్ణ కుంభాలతో, పసుపు కుంకుమలతో స్వాగతం పలికారు. అమ్మవారి ఘటాలను ఎత్తుకున్న వారి పాదాలకు జలాభిషేకం చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉండకూడదు



వివిధ వేషధారణలో ఉన్న చిన్నారులలో విజయలక్ష్మి, కృష్ణంరాజు

అగనంపూడి: పెరిగే పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉండరాదనే లక్ష్యంతో జీవీఎంసీ 86, 88 వార్డుల్లోని 11 అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకొని పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని ఐదేళ్ల నుంచి అందిస్తున్నామని హైదరాబాద్ బ్యాటరీస్ లిమిటెడ్ ఉన్నతాధికారులు విజయలక్ష్మి, కృష్ణంరాజు అన్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు, తల్లులు, ఇనస్ట్రక్టర్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పోషకాహారం లోపం వల్ల బాలల్లో రక్తహీనత ఏర్పడుతుందని, దీనివల్ల పెరుగుదలలో లోపంతోపాటు శక్తిహీనులవుతూ తరచూ అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకొని బాలలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పౌష్టికాహారం సరఫరా ప్రారంభించి ఐదేళ్లు కావస్తున్న సందర్భంగా బాలలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ యూనిట్ హెడ్ శ్రీకాంత్, ఐసీడీఎస్ ఏపీఓ నీలవేణి, గ్రామాల పెద్దలు ముద్దపు మురళీ మోహన్, టి.వి.నాయుడు, పి.ప్రసాద్, ఎస్.శ్రీను, రవి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు



ఆరోగ్య బీమా కార్డులను పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలను అందజేయడమే వికసిత భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ జంక్షన్ వద్ద కిల్లాన ముసలయ్య ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుగూ, ఆయుష్మాన్ భారత్ పథకం కింద రూ.5లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం అందిస్తున్నారని వివరించారు.మహిళాభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు బీమా కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదగంట్యాడ ఆరోగ్య కేంద్రం అధికారులు రోహిణి, తనకాల సత్యనారాయణ,నాయకులు గూటూరు శంకరరావు, బొండా యల్లాజిరావు, జిలకర్ర భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

29 వరకు మానసిక వైద్య శిబిరం నిర్వహణ

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో సైన్స్‌డేని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరం జరిగింది. దీనిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ప్రజల మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యతను సైకాలజిస్టులు తీసుకోవాలన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి తగిన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు తగిన అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విభాగంలో వివిధ మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎండీ ఎస్.దివాకర్ తదితరులు పాల్గొన్నారు.